క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరి



మరికల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగ్గా హెల్మెట్ ధరలించాలని జిల్లా ఎంవీఐ దిప్తీ అన్నారు. శనివారం మండలంలోని జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆటో, జీపు డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రమాదాలను ఆరికట్టడం కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అలాగే ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ తోపాటు ఆర్సీ, ఇన్‌రెన్స్ పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

గాజులయ్య తండాను గ్రామ పంచాయతీ చేయాలి

మరికల్: మండలంలోని గాజులయ్య తండాను ప్రత్యేక పంచాయతీ చేయాలని శనివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. బుద్యాగానితండా పంచాయతీ పరిధిలో తమ తాండ ఉండటంతో అభివృద్ధికి నోచుకోవడం లేదని ఎమ్మెల్యేకు వివరించారు. తమ తాండను ప్రత్యేక పంచాయతీ చేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. రాజు నాయక్, రాంసింగ్, రాములు, భాసునాయక్, మంగ్యనాయక్, చిన్నానాయక్, శంకర్, లక్ష్మణ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గజరందొడ్డిని పంచాయతీ చేయాలి

కృష్ణా: మాగనూర్ మండలంలోని కొల్పూర్ పంచాయతీలో అనుబంధ గ్రామమైన గజరందొడ్డిని పంచాయతీగా ఏర్పాటుచేయాలని కోరుతూ.. శనివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి గ్రామస్తులు వినతిప్రతాన్ని అందజేశారు.ఈ విషయంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడికి సన్మానం



మరికల్: మండల బీజేపీ అధ్యక్షుడిగా ఎంపికైనా మేణుగోపాల్‌ను శనివారం జిల్లా పార్టీ అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. మాజీ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడికి మండల పార్టీ బాధ్యతలను అప్పగించారు. అనంతరం పాత, కొత్త అధ్యక్షులను నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీరాం, వెంకటేష్, నిఖిల్, రమేష్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్‌లో జేవైఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మండల యువజన సంఘం అధ్యక్షులు సునిల్‌రెడ్డి క్యాలెండర్ ఆవిష్కరించి పంపిణీ చేశారు. బుచ్చారెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, ఆంజనేయులు, రాంరెడ్డి, దామోదర్‌రెడ్డి, బాలయ్య, కృష్ణయ్య, వెంకటయ్యగౌడ్, మొగులయ్య, గోవింద్ పాల్గొన్నారు.


ఆలయంలో శని త్రయోదశి పూజలు



కోస్గి: పట్టణ శివారలో ముక్తిపాడ్ పరిధిలో ఉన్న పార్వతీశ్వరస్వామి ఆలయంలో శని త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, శనీశ్వర స్వామి వారికి తైలాభిషేకం, తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగాణంలో అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పూజారులు వినయ్ స్వామి, పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

కురుమూర్తి గిరి ప్రదక్షిణకు తరలిన భక్తులు

మరికల్: అయోధ్యలో బాలరాముడి విగ్రహం ప్రతిష్ఠించి ఏడాది పూర్తి కావడంతో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని పలు గ్రామాల నుంచి కురుమూర్తి గిరి ప్రదక్షిణకు వందల మంది భక్తులు తరలి వెళ్లారు. కార్యక్రమంలో రాజేష్, రవి, మొగులప్ప, జైపాల్‌రెడ్డి, అశోక్, లక్ష్మికాంత్ పాల్గొన్నారు.



మట్టి గుట్టలు మాయం!

- అనుమతి లేకుండా తవ్వకాలు..
- రాత్రి అయితే చాలు టిప్పర్లతో తరలింపు
- పట్టించుకోని అధికారులు

ధన్వాడ: అనుమతుల్లేవ్.. అడిగేటోళ్లు లేరు.. ఇంకేముంది గుట్టలను తవ్వేస్తున్నారు. రూ. లక్షల విలువ చేసే మట్టిని దోచుకెళ్తున్నారు. ఇలా అక్రమార్కులకు మట్టి వ్యాపారం కాసుల వర్షం కురిపిస్తుండగా.. ప్రభుత్వం ఆదాయానికి గండి పడుతోంది. మండలంలోని మనిపూర్‌తాండ, మంత్రోనిపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో రాత్రి పగలు అనే తేడా లేకుండా నిత్యం మట్టి తవ్వకాలు చేపట్టి వాహనాల ద్వారా తరలిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామ శివారులోని వెంచర్లకు పంపిణీ చేస్తున్నారు. రెవెన్యూ పోలీసు అధికారులు పట్టించుకోకపోవడంతో మట్టిని తవ్వి ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు.

పైసా వసూల్..

మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో యేథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. టిప్పర్‌కు రూ. 3వేల నుంచి రూ. 4వేల వరకు అమ్మకాలు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు.



గుట్టనుంచి తొలగించిన మట్టి

అనుమతి లేకుండా తవ్వకాలు..

మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్న వ్యాపారులు ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా దందా సాగిస్తున్నారు. మండలంలోని మంత్రోనిపల్లి, మందిపల్లి, ధన్వాడ గ్రామ శివారులోని మట్టి గుట్టలను విచ్చవిడిగా తవ్వకాలు చేపడుతున్న అధికార యాంత్రంగం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. గుట్టల తవ్వకాలకు రెవెన్యూ శాఖకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.

ఫిర్యాదు చేస్తే చర్యలు..



మట్టి అక్రమ రావాణాపై ఆధారాలతో ఫిర్యాదు చేస్తు చర్యలు తీసుకుంటాం. వీఆర్ఓ, వీఆర్ఏల వ్యవస్థ లేకపోవడంతో ఇలాంటి ఆరోపణలపై తామే స్వయంగా వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అనుమతి లేకుండా తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- తహసీల్దార్, సింధూజ, ధన్వాడ

పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న డీసీసీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి

నారాయణపేట: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని డీసీసీ మాజీ కుంభం శివకుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో దామరగిద్ద, ధన్వాడ, మరికల్, నారాయణపేట మండలాలకు చెందిన కార్యకర్తలు, నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో విద్య, వైద్యం, తాగు, సాగునీరు అందించడమే లక్ష్యంగా.. మీరు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించిన ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి నేతృత్వంలో ప్రజా సంక్షేమం.. అభివృద్ధే ధ్యేంగా ఆహర్నశలు కృషి చేస్తామన్నారు. ముందుగా పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఆవేదన వెలిబుచ్చారు. ఎమ్మెల్యేగా గెలిపించేందుకు కృషి చేసిన వారిని గుర్తించండి.. స్వార్థంకోసం ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తమ అందరి అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోవాలని ఆకాంక్షించారు. కార్యకర్తలు, నాయకుల మనోభావాలను విన్న తర్వాత ఆయన మాట్లాడారు.. కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు రానున్న ఎన్నికల్లో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు



నారాయణపేట రూరల్: మండలంలోని ఎక్లాస్‌పూర్ శివారులో కొంతమంది డబ్బులతో పేకాట పందెం పెట్టుకున్నారని విశ్వసనీయ సమాచారంతో శనివారం పోలీసులు దాడులు చేశారు. ఈ క్రమంలో ఐదుగురు వ్యక్తులను గుర్తించి వారి నుంచి రూ.6700 నగదు, 5ద్విచక్ర వాహనాలు, ఒక బజాజ్ ఆటో, పేక ముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి గేమింగ్ ఆక్ట్ కింద కేసునమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



కృష్ణా: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన అండర్–14 బాలికల విభాగం ఖోఖో పోటీల్లో కున్సీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న తనుజ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సౌమ్య తెలిపారు. శనివారం హెచ్ఎం సంతోషి మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో కూడా తనుజ ఉత్తమ ప్రతిభ కనబరిచి దేశం తరపున ఆడే అవకాశం పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దీప, ఉపాధ్యాయులు నరేందర్, నర్సింహులు, రమేష్, ఖాసీం, ఆలీ, సౌమ్య విద్యార్థినిని అభినందించారు.

స్ప్రేయింగ్ డ్రోన్‌పై అవగాహన



డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధులు

నారాయణపేట రూరల్: మండలంలోని కొల్లంపల్లిలో అండ్ రిప్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో స్ప్రేయింగ్ డ్రోన్ పై శనివారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధి మురళీధర్ మాట్లాడుతూ.. వరి పంటలో మీథేన్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి వాటిని తగ్గించి ఆరుతడి ద్వారా వ్యవసాయం చేయాలని సూచించారు. నీళ్లను ఆదా చేయడం, తెగుళ్లు రాకుండా అరికట్టడం, భూసారాన్ని పెంచడం, దిగుమతి పెరిగే లాభాలను అర్పించడం వంటి వాటికి డ్రోన్ సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు మనోహర్, ఏఈఓ అంజమ్మ, నాయకులు జనార్దన్ గౌడ్, ఎండీ గౌస్, వశిష్ఠ కుమార్, వెంకటరమణ, మల్లేష్, హేమంత్, రాము పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం.. తల్లి, బిడ్డ క్షేమం

కొత్తపల్లి: మండలంలోని నిడ్జింత గ్రామానికి చెందిన సాయమ్మ మహిళకు అనే మహిళకు పురిటి నొప్పులు రాగా కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు సమాచారాన్ని అందించారు. అంబులెన్స్‌లో మద్దూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలో నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్‌లోనే సిబ్బంది సుఖ ప్రసవం చేశారు. సాయమ్మ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారు. తమ బిడ్డకు ప్రసవం చేసిన 108 అంబులెన్స్ సిబ్బందికి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి..



మక్తల్: విద్యార్థులు ఇష్టంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని మోటివేషన్ స్పీకర్ సుధీర్ అన్నారు. శనివారం పట్టణంలోని బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షల సమయంలో ఏమాత్రం భయపడకుండా పట్టుదలతో చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షల సమయంలో మంచిగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మోటివేషన్ స్పీకర్ సుధీర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో చంద్రకాంత్‌గౌడ్, హన్మంతు, రవికుమార్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ పావనీ, కర్ని‌స్వామి, రాజులాశిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



నారాయణ పేటలో భోగి మంటల వద్ద ఉపాధ్యాయులు

నారాయణ పేట ఎడ్యుకేషన్: మండలాల్లోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని శనివారం ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు.. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ముగ్గుల చుట్టూ బొడ్డెమ్మలు వేసి అలరించారు. అదేవిధంగా కాకతీయ పాఠశాలలో చిన్నారులు హరిదాసు వేశాధరణతో ఆకట్టుకున్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాలలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని నేరడగం మఠం పాఠశాల విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మఠం ఆవరణలో రంగురంగుల ముగ్గులు వేశారు. గెలుపొందిన వారికి బహుమతులను మఠం పీఠాధిపతి పంచమ సిద్ధలింగ మహాస్వామి అందజేశారు.

ఊట్కూరు: మండలంలోని భవాని మందిర్‌లో ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులు రంగురంగుల ముగ్గులను వేసి ప్రతిభ కనబరిచారు. గెలుపొందినవారికి బహుమతులు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అశోక్‌చౌదరి, రాధ, లక్ష్మీ, విమల, రాధిక, చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూరులో ముగ్గులు వేస్తున్న మహిళలు



కృష్ణాలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు

ఆర్టీఓ బోర్డు జిల్లా మెంబర్‌గా పోషల్ రాజేష్

నారాయణపేట: ఆర్టీఓ బోర్డు జిల్లా మెంబర్‌గా పేట పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పోషల్ రాజేష్ ఎంపికయ్యారు. రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు.. శనివారం జిల్లా ఆర్టీఓ కార్యాలయంలో ఆర్టీఓ మేఘా గాంధీ పోషల్ రాజేష్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోషల్ రాజేష్ మాట్లాడుతూ జిల్లా ఆర్‌టీఓ బోర్డు సభ్యులుగా తనను నియమించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.



నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట: జిల్లా పరిధిలో నేరాల నియంత్రణపై దృష్టి సారించి, దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ నల్లపు లింగయ్య సూచించారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో మక్తల్, మరికల్, కోస్గి పోలీసు అధికారులతో నిర్వహించిన నెలవారి నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ ఉన్న కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి డీఎస్పీ అడిగి తెలుసుకొన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను తగ్గించేందుకు సంబంధిత అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేసి కేసులను తగ్గించాలని ఆయన సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా చేయాలి, ఏ ఏ అంశాలు క్రోడీకరించాలి తదితర అంశాలపై వివరించారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. నేరాల నియంత్రణ కోసం నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, అనుమానిత వ్యక్తులను ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీ చేయాలన్నారు. పాత నేరస్తులపై పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేస్తూ వారిని ప్రతిరోజు తనిఖీ నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణ పట్టణాలలో ఆయా గ్రామాల వీపీఓలు పోలీస్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని, ప్రజలకు సీసీ కెమెరాల ప్రాధాన్యతను గుర్తించాలని సూచించారు. సంక్రాంతి సెలవులు ఉన్నందున చాలామంది ఊర్లకు వెళ్తుంటారని, దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీఐలు చంద్రశేఖర్, రాజేందర్ రెడ్డి, దస్రునాయక్, ఎస్ఐలు భాగ్యలక్ష్మిరెడ్డి, రాము, రమేష్, కుర్మయ్య, రాంలాల్, బాల్‌రాజ్, అశోక్ బాబు, నవీద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



చిత్రటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

ధన్వాడ: మండల కేంద్రంలో చేనేత కార్మికులు శనివారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. ముఖ్యమంత్రి చేనేత కార్మికుల స్థితిగతులను పరిశీలించి వారి సంక్షేమం కోసం ఆలోచించి, చేనేత కార్మికుల కోసం చేనేత అభయ హస్తం పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రకటిస్తూ జీఓ జారీ చేశారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రఘువీర్, బోర్లశివాజీ, వెంకట్రాములు, గోపికృష్ణ, లక్ష్మయ్యగౌడ్, రాంచంద్రయ్య, సుధాకర్, నరేందర్‌గౌడ్, జయప్రకాష్, నర్సింహ, కృష్ణయ్య, రామ్మోహన్, శ్రీనివాసులు, రంగయ్య పాల్గొన్నారు.

కనుల పండువగా పల్లకీ సేవ

ఊట్కూరు: మండలంలోని గోశాల హనుమాన్ మందిర్‌లో శనివారం కనుల పండువగా పల్లకిసేవను భక్తులు నిర్వహించారు. అనంతరం పల్లకిలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్వామివారికి పంచామృతాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు బాల్‌రెడ్డి, సూర్యనారాయణ గుప్త, సూర్యప్రకాష్‌రెడ్డి, ఎల్కోటి నారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, ఎల్కోటి జనార్ధన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, డాక్టర్ రాము పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

నారాయణపేట రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని డాక్టర్ మదన్మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని పేరపళ్లలో శనివారం నిర్వహించిన క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సెల్ ఫోన్‌తో సమయాన్ని వృథా చేయకుండా మైదానంలో క్రీడా పోటీల్లో పాల్గొనాలన్నారు. క్రీడా పోటీలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో పీఈటీ బసంత్ రెడ్డి, కిరణ్ గౌడ్, వెంకట్ రాములు, నర్సిరెడ్డి, శ్రీ రామసేన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

మండలంలోని జాజాపూర్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు.. ప్రతిరోజు ఆటలు ఆడటంతో శారీరక ధ్రుడత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందని నిర్వాహకులు అన్నారు. క్రీడా పోటీల్లో విజేతలకు రూ.40వేలు, రూ. 30వేలు నగదు బహుమతి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రవి, వెంకటేష్, లక్ష్మణ్, హరీష్, శివకుమార్ పాల్గొన్నారు.



జెర్సీలు అందిస్తున్న డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి

ఘనంగా రామాలయం వార్షికోత్సవ పూజలు

మరికల్: మండలంలోని చిత్తనూర్ శివారులో నిర్మించిన రామాలయం మొదటి వార్షికోత్సవ పూజలను శనివారం ఆలయ పూజారి లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదలతో పాటు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ పూజలు చేస్తున్న భక్తులు

వడ్డెర ఓబన్నకు ఘన నివాళి

ఆత్మకూర్: తెల్ల దొరల పాలిట సింహస్వప్నం వడ్డె ఓబన్న అని వడ్డెర సంఘం నాయకులు కొనియాడారు. శనివారం వడ్డె ఓబన్న జయంతిని పురస్కరించుకొని స్థానిక గాంధీచౌక్‌లో బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. అంతకంటే ముందు ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వడ్డెపరమేష్, వడ్డెనర్సింహా, పెద్దరాములు, వెంకటేష్, చిన్నరాములు, వడ్డె నాగాంజనేయులు తదితరులు ఉన్నారు.

కొత్తకోట రూరల్: పట్టణంలో వడ్డెర ఓబన్న జయంతిని పురస్కరించుకొని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉమ్మడి జిల్లా సీడీసీ చైర్మన్ బీసం చెన్నకేశవరెడ్డి, కురుమూర్తి యాదవ్ మాట్లాడుతూ మొదటి స్వాతంత్ర ఉద్యమానికి పదేళ్ల ముందే బ్రిటిష్ పాలకులను ఎదిరించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. వడ్డెర సామాజిక వర్గానికి రాజకీయంగా ప్రాతినిధ్యం లేదని, సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అని ప్రభుత్వం వడ్డెర ఓబన్నను స్వాతంత్ర సమరయోధుడిగా గుర్తించి హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని నెలకొల్పాలని కోరారు. దీంతో పాటు ఆయన పేరు మీద పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



ఆత్మకూర్‌లో వద్ద ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వడ్డెరసంఘం నాయకులు

కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాసులుయాదవ్, ఎస్‌బీసీ కృష్ణయ్యగౌడ్, సత్యంయాదవ్, యూత్ అధ్యక్షుడు నెహ్రూ, రవీందర్‌రెడ్డి, మేఘారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో..

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబ్బన్న జయంతిని పురస్కరించుకొని శనివారం బీఎస్పీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ దేవరకద్ర అసెంబ్లీ ఇన్‌చార్జి జనంపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో వడ్డెర సామాజిక వర్గానికి రాజకీయ ప్రాతినిథ్యం కల్పించాలన్ని కోరారు. కార్యక్రమంలో శ్రీను, గోపాల్, కృష్ణయ్య, ఆంజనేయులు, ఎర్రన్న, కొండన్న, శ్రీకాంత్, వివేక్, నరేష్, గోపాల్ నాగరాజు, కృష్ణయ్య, పుల్లయ్య ఉన్నారు.